సాక్షి
శ్రీకాకుళం
మంగళవారం । 8 । అక్టోబర్ । 2024



ఇదేం తీరు..!
వైద్యశాఖ ఉద్యోగి నిర్వాకంతో మోసపోయిన మహిళకు న్యాయం జరగడం లేదు. బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో జాప్యం నెలకొంటోంది. - 10లో



పండగ కోసం ఇంటికి వస్తూ..
రైలు నుంచి జారిపడి ఎస్ఎస్‌బీ జవాన్ మృతి చెందారు. నందిగాంలో విషాదఛాయలు అలముకున్నాయి. - 10లో

నేడు జాబ్‌మేళా
నరసన్నపేట: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో టెన్త్ నుంచి డిగ్రీ వరకూ విద్యార్హత కలిగిన నిరుద్యోగుల కోసం నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఉదయం 9.30 గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ఉరిటి సాయికుమార్ తెలిపారు. 18 నుంచి 30 ఏళ్ల వయసు కలిగిన వారు అర్హులని, పూర్తి వివరాలకు 9949900672 నంబరును సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

జెడ్పీ సీఈఓగా శ్రీధర్‌రాజా బాధ్యతల స్వీకరణ



కలెక్టర్‌ను కలిసిన జెడ్పీ సీఈవో శ్రీధర్‌రాజా


అరసవల్లి: జిల్లా పరిషత్ సీఈవోగా ఎల్.ఎన్.వి.శ్రీధర్ రాజా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఆర్డీఓలు, మండల స్థాయి అధికారులు, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్లు, మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలతో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్మాణాలు ప్రారంభం కాని వాటిపై దృష్టి సారించాలని ఆదేశించారు. ఇసుక అందుబాటులో ఉంటుందని తెలిపారు. లే అవుట్లలో విద్యుత్, నీరు, తదితర మౌలిక వసతులు కల్పించాలన్నారు. వార్డు సెక్రటరీ, వెల్ఫేర్ అసిస్టెంట్ ఇతర ఉద్యోగులను సమన్వయం చేసి లబ్ధిదారులతో మాట్లాడి పనులు జరిగేలా చొరవతీసుకోవాలన్నారు.

శ్రీకాకుళం కమిషనర్‌పై ఆగ్రహం..
శ్రీకాకుళం అర్బన్ పరిధిలో ఉన్న గృహనిర్మాణ వివరాలు కమిషనర్ వద్ద లేకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఉన్న కాంట్రాక్టర్లతో మాట్లాడి నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు.కార్యక్రమంలో శ్రీకాకుళం, టెక్కలి ఆర్డీవోలు కె.సాయి ప్రత్యూష, ఎం.కృష్ణమూర్తి, హౌసింగ్ ఇన్‌చార్జి పీడీ జి.నగేష్ తదితరులు పాల్గొన్నారు.

లలితా త్రిపుర సుందరికి ద్వాదశ హారతులు



ద్వాదశ హారతులు ఇస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నాగావళి తీరంలోని తమ్మినాయుడుపేటలో అమ్మా సంస్థాన్‌లో లలితా త్రిపుర సుందరీదేవికి దసరా ఉత్సవాలలో భాగంగా సోమవారం ద్వాదశ హారతులు ఇచ్చారు. అర్చకులు శ్రీపాద సురేష్‌శర్మ, ఆలయ ధర్మకర్త సాగి శ్రీనివాసరాజు వర్మల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఎంబీఏ, ఎంసీఏ స్పాట్ అడ్మిషన్లు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఎంబీఏ, ఎంసీఏ స్పాట్ అడ్మిషన్లు సోమవారం నిర్వహించారు. ఏపీ ఐసెట్ -2024 కౌన్సెలింగ్ పూర్తికాగా, సీట్లు మిగలడంతో ఐసెట్ ర్యాంకు ఉన్న విద్యార్థులకు రిజర్వేషన్ రోస్టర్ ఆధారంగా సీట్లు కేటాయించారు. పేమెంట్, సెల్ఫ్ ఫైనాన్స్ విధానంలో ఎంబీఏలో 15 మందికి, ఎంసీఏలో 9 మందికి ప్రవేశాలు కల్పించారు. సంబంధిత విభాగాధికారులు పర్యవేక్షించారు.

కూటమి నేతలకే దసరా ధమాకా!

ఇటు ఇసుక

- సామాన్యులకు ఇసుక నిల్
- కూటమి మాఫియా జేబులు ఫుల్



ఎన్ని పాలసీలు తెచ్చినా ఇసుక విధానం లోపభూయిష్టమే. ఇటు ప్రభుత్వానికి ఆదాయం అంతంతమాత్రం...అలా అని వినియోగదారుడికి లాభం లేదు. ఎటొచ్చి బాగుపడింది ఎమ్మెల్యేలు. ఇతర నాయకులే. వైఎస్ జగన్ ప్రభుత్వంలో నిర్దేశించిన ధర కన్న మూడింతలు ఇసుక ధర ఉంది. జగన్ ఉన్నప్పుడే బెటర్ అని అంతా అనుకుంటున్నారు.
– సోషల్ మీడియాలో సాక్షాత్తు టీడీపీ కార్యకర్తలు పెడుతున్న ఇలాంటి పోస్టులెన్నో



లారీ ఇసుక రూ.40వేలు.. 50వేలు.. 60వేలు... చరిత్రలో ఎప్పుడు చూడలేదు. ఇంత దారుణమా. ఉచిత ఇసుక విధానమంటే ఇదేనా. దీన్ని దోపిడీ కాకపోతే ఏమంటారు. పచ్చనేతలు కోట్లు వెనకేసుకోవడం కోసం సామాన్య ప్రజల్ని వంచిస్తారా? వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారికంగా ఇసుక విక్రయించింది. ప్రభుత్వానికి ఆదాయం వచ్చింది. ఇదెక్కడి విధానం. ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి. టీడీపీ నేతలు జేబులు నింపుకోవడమేనా ఉచిత ఇసుక విధానం.
– ఇసుక ధరలపై ప్రజల ఆవేదన ఇది



నాలుగు నెలలుగా ఇసుక దొరక్క అల్లాడుతున్నాం. వ్యాపారం మొత్తం పోయింది. మా నష్టానికి ఎవరు బాధ్యులు. భవన నిర్మాణ రంగం కుదేలైపోయింది.
– బిల్డర్ల ఆవేదన నుంచి వస్తున్న ఇటువంటి పోస్టులెన్నో

సామాన్యులు దసరా పండగ చేసుకుంటే.. కూటమి నేతలు కాసుల పండగ చేసుకుంటున్నారు. ఓవైపు ఇసుక, మరోవైపు మద్యం షాపులతో గుత్తాధిపత్యానికి సిద్ధమైపోతున్నారు. ఇప్పటికే ఉచిత ఇసుక విధానమంటూ సామాన్యులకు ఇసుక దూరం చేసిన తెలుగు తమ్ముళ్లు.. తాజాగా లిక్కర్ పాలసీని సైతం తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. సామాన్య వ్యాపారులు దరఖాస్తు చేయికుండా కట్టడి చేస్తున్నారు. తమ మాట వినని వారిని బెదిరింపులకు గురి చేస్తున్నారు.



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

ఉచిత ఇసుక అందిస్తామని ఎన్నికల్లో చెప్పడంతో ప్రజలు నమ్మి ఓటేశారు. అధికారంలోకి వచ్చాక టన్నుకి రూ. 340, రవాణా చార్జీలు, బాట ఖర్చులు...ఇదే మా ఉచిత ఇసుక విధానమని చంద్రబాబు కొత్త భాష్యం చెప్పారు. పోనీ, ఆ ఇసుకైనా దొరుకుతుందా? అంటే అదీ లేదు. జిల్లాలోని నదీ తీర ప్రాంతాలన్నీ నేతలకు దారాదత్తం చేసేశారు. వాళ్లంతా ఇప్పుడు నచ్చినట్టుగా తవ్వుకుని, ఇష్టారీతిన అమ్ముతున్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా లారీ ఇసుక రూ.40వేలకు దాటిపోయింది. జరుగుతున్న ఇసుక దోపిడీని సాక్షాత్తు సొంత పార్టీ వాళ్లే తప్పు పడుతున్నారు. సోషల్ మీడియా ద్వారా చంద్రబాబుకు, లోకేష్‌కు ట్యాగ్ చేసి ప్రశ్నిస్తున్నారు. టీడీపీ కార్యకర్తలే నిలదీస్తున్నారంటే సామాన్య ప్రజల ఆవేదన ఎలా ఉందో ఇక చెప్పనక్కర్లేదు.

బాబోయ్ ధరలు..


- ఇసుక దొరికే ప్రాంతాలన్నీ టీడీపీ నేతల చేతుల్లో ఉండటంతో సామాన్యులకు ఇసుక దొరకని పరిస్థితి నెలకుంది.
- ప్రభుత్వం అధికారికంగా డీసిల్టేషన్ పాయింట్ పేరుతో రెండు చోట్ల ఇసుక విక్రయిస్తున్నామని చెబుతున్నా అక్కడ కూడా ఇసుక ప్రియమైపోయింది. 20టన్నుల ఇసుకకు రూ.6800 చలానా, స్థానిక నాయకుల ముడుపులు రూ.14వేల వరకు చెల్లించాల్సి ఉంటుంది. రవాణా చార్జీ కలిపితే రూ. 35వేలు అవుతుంది. విశాఖ తదితర ప్రాంతాలకైతే రూ.45 వేల నుంచి రూ. 50వేల వరకు పలుకుతోంది. అది కూడా కొంతమందికే.
- మరోవైపు టీడీపీ నేతల జోక్యంతో ఇసుక అక్రమంగా తరలిపోతోంది. దీనికి నిలువెత్తు సాక్ష్యం .. కలెక్టర్ ఆకస్మిక తనిఖీ సమయంలో పైడిభీమవరం తనిఖీ కేంద్రం వద్ద బయట పడ్డ వ్యవహారమే.
- బూర్జ మండలం నారాయణపురం డీసిల్టేషన్ పాయింట్ నుంచి ఇసుక అక్రమంగా తీసుకొస్తున్నట్టు లారీ డ్రైవర్ చెప్పారు. అంతే కాకుండా ఒడిశా రశీదు ఇచ్చి తమతో రవాణా చేయిస్తున్నారని ఓపెన్ అయ్యారు.



కొనుక్కుందామన్నా అధికారికంగా ఇసుక దొరకకపోవడం దారుణం. టీడీపీ నాయకులు అక్రమంగా నడుపుతున్న ర్యాంపుల్లోకి వెళ్లి కొనుక్కోవాలా? వారికి సలామ్ కొట్టి.. వారి ముందు మోకరిల్లాలా? ఇలాంటి దుస్థితి ఎప్పుడూ చూడలేదు. కూటమి ప్రభుత్వంలో తొలిసారిగా చూస్తున్నాం. – ఇసుక కోసం అవస్థలు పడుతున్న లారీ, ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్ల మనోగతమిది

భారీగా ఇసుక దోపిడీ..
జిల్లాలో నాగావళి, వంశధార, బాహుద తదితర నదీ తీర ప్రాంతాలన్నీ పచ్చనేతలకు దారాదాత్తం చేసేశారు.

- ఆమదాలవలస నియోజకవర్గంలో కాఖండ్యాం, నారాయణపురం, చినకాలం, నిమ్మ తొర్లాడ, దూసి,తోటాడ,అక్కివరం, బెలమం, లొద్దలపేట, కొత్తవలస, సింగూరు, దిబ్బలపేట ప్రాంతాలు
- శ్రీకాకుళం నియోజకవర్గంలోని బైరి, కరజాడ, బూరవల్లి, కళ్లేపల్లి. కిల్లిపాలెం, పొన్నాం, బట్టేరు, నైరా, గార ప్రాంతాలు
- నరసన్నపేట నియోజకవర్గంలోని మడపాం, పర్లాం, రామకృష్ణాపురం, శ్రీముఖలింగం, దొంపాక, లుకలాం, బుచ్చిపేట, చేనులవలస, చెవ్వాకులపేట, గోపాలపెంట, ఉర్లాం ప్రాంతాలు
- పాతపట్నం నియోజకవర్గం పరిధిలోని కొత్తూరు, హిరమండలం తదితర ప్రాంతాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు, విక్రయాలు సాగుతున్నాయి.



మరోవైపు ఇసుక కొరతతో భవన నిర్మాణాలు నిలిచిపోవడంతో జిల్లాలో సుమారు 60వేల మంది కార్మికులు ఉపాధిని కోల్పోయారు.

అటు మద్యం

- తెలుగు తమ్ముళ్ల కనుసన్నల్లో మద్యం దుకాణాలు
- దరఖాస్తులపై జిల్లా వ్యాప్తంగా ఆంక్షలు
- కాదన్నవారంతా తప్పుకోవాలని హెచ్చరికలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

కూటమి ప్రభుత్వం భారీ దోపిడీకి తెరలేపింది. టీడీపీ ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యులు, బినామీలకే మద్యం దుకాణాలను దక్కేలా వ్యూహం రచించి పక్కాగా అమలు చేస్తున్నారు. ఔత్సాహిక వ్యాపారులను భయపెట్టి, దుకాణాలపై గుత్తాధిపత్యం కోసం పెత్తనం చెలాయిస్తున్నారు. తమ ఏరియాకు వచ్చి ఇబ్బందులు పడొద్దంటూ వార్నింగ్‌లు ఇచ్చి భయాందోళనలకు గురి చేస్తున్నారు. వీరి విధానాలు చూసి సామాన్యులు హడలెత్తిపోతున్నారు. ఫలితంగా మద్యం దుకాణాలకు ఆశించిన మేర దరఖాస్తులు పడటం లేదు. లిక్కర్ బిజినెస్ అంతా తమ గుప్పెట్లో ఉండేలా అధికారికంగా తెరతీశారు. ఇప్పటి వరకు 158 దుకాణాలకు 880 దరఖాస్తులు మాత్రమే వచ్చాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. శ్రీకాకుళం, రణస్థలం స్టేషన్ల పరిధిలో కాస్త ఎక్కువ దరఖాస్తులు వచ్చాయి. మిగతా అన్ని చోట్ల పదుల సంఖ్యలోనే ఉన్నాయి. జిల్లాలో గత టీడీపీ ప్రభుత్వం హయాంలో మద్యం దుకాణాలు కోసం టెండర్లు పిలవగా 6వేలకు పైగా దరఖాస్తులొచ్చాయి. అప్పట్లో సిండికేట్ ఉన్నప్పటికీ ఔత్సాహిక వ్యాపారులు దరఖాస్తు చేసుకునే స్వేచ్ఛ ఉండేది. ఇప్పుడా పరిస్థితి లేదు.

ఎక్కడెక్కడ ఎలా ఉందంటే..

జిల్లా వ్యాప్తంగా శ్రీకాకుళం, రణస్థలం స్టేషన్‌లలో ఫర్వాలేదు. మిగతా అన్నిచోట్ల తక్కువగానే వస్తున్నాయి. ఈ ప్రాంతాల్లో నేతల జోక్యం ఎక్కువగా ఉండటంతో కొంతమందే దరఖాస్తులు దాఖలు చేస్తున్న పరిస్థితి నెలకొంది.



జిల్లాలో అత్యధిక లిక్కర్ బిజినెస్‌ను భీమవరానికి చెందిన చౌదరికి అప్పగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. గతంలో ఆమదాలవలస నియోజకవర్గంలో చౌదరి డామినేషన్ ఉండేది. ఇప్పుడది జిల్లా అంతటికి విస్తరించనుంది. ఆయన ద్వారా జిల్లాలో వెయ్యికి పైగా దరఖాస్తులు వేయిస్తున్నటు సమాచారం.

- **ఇచ్ఛాపురం నియోజకవర్గంలో** కీలక నేత డైరెక్షన్‌లోనే దరఖాస్తులు పడుతున్నాయి. తనకు నచ్చని వారికి దరఖాస్తులు చేయొద్దని నేరుగా చెప్పేస్తున్నారు. అనుచరులతో పాటు ఒడిశాలోని బినామీ వ్యాపారులతో ఎక్కువ దరఖాస్తులు చేయిస్తున్నారు. ఇక్కడ కూటమిలోని జనసేన నేతలకు కూడా నో చాన్స్ అనేస్తున్నారు.
- **పలాస నియోజకవర్గంలో** కీలక నేత కుటుంబీకుల కనుసన్నల్లోనే దరఖాస్తుల ప్రక్రియ నడుస్తోంది. గతంలో కూడా ఆయన దందాయే నడిచింది. పలాస-కాశీబుగ్గలో ఇప్పటికే ఏడు దుకాణాలకు సర్దుబాటు కూడా జరిగింది. వీటిని విడిచి పెట్టి మిగతా వాటికి దరఖాస్తులు చేసుకోవాలని గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు తెలిసింది.
- **నరసన్నపేట నియోజకవర్గంలో** కీలక నేత సుపుత్రుడే అన్ని చూసుకుంటున్నారు. ఏ దుకాణానికి ఎవరు వేయాలో ఆయనే డిసైడ్ చేస్తున్నారు. బహిరంగంగానే వ్యాపారులకు వార్నింగ్‌లు వెళ్తున్నాయి. ఒక్కో షాపును నలుగురు ఐదుగురు నాయకులకు అప్పగించనున్నారు. ఇప్పటికే దుకాణాల కోసం బిల్డింగ్ చూసుకోవాలని కూడా చెప్పేశారు. బయట వ్యక్తులకు చోటు లేదని, ఎవరికి ఏ షాప్ ఇవ్వాలో తానే నిర్ణయిస్తామని, కేడర్ కు డబ్బులు వచ్చే విధంగా చూసుకుంటామని టీడీపీ శ్రేణులకు అభయమిచ్చారు.
- **ఆమదాలవలస నియోజకవర్గంలో** కీలక నేత కనుసన్నల్లోనే అంతా జరుగుతోంది. ఎవరికైతే నో అని సమాధానం వచ్చిందో వారంతా గమ్మున ఉంటున్నారు.
- **టెక్కలి నియోజకవర్గంలో** బయట వ్యక్తులు ఇక్కడ అడుగు పెట్టడానికే భయపడుతున్నారు. ఇక్కడంతా సోదరుడు రాజ్యమేలుతుండటంతో మద్యం దుకాణాలన్నీ వారి కనుసైగల్లోనే ఏర్పాటు కానున్నాయి. 26 దుకాణాలకు 50 దరఖాస్తులు మాత్రమే పడ్డాయంటే ఇక్కడే స్థాయిలో శాసిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.
- **పాతపట్నం నియోజకవర్గంలో** రెండు గ్రూపులు తలపడుతున్నాయి. ఇక్కడ నియోజకవర్గ కీలక నేత.. పొరుగు నియోజకవర్గ కీలక నేతతో కలిసి వ్యవహారాలు నడుపుతున్నారు. సిండికేట్‌గా ఏర్పడి లిక్కర్ బిజినెస్‌ను గుప్పెట్లో పెట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. తమకు తెలియకుండా దరఖాస్తులు చేయొద్దని, చెప్పినోళ్లే వేయండని పీఏల ద్వారా సుతిమెత్తగా వార్నింగ్‌లు వెళ్తున్నాయి. ఇక్కడ మరో గ్రూపు కూడా ఉంది. కీలక నేతకు పోటీగా ఉన్న నేత ఆధ్వర్యంలో నడుస్తోంది. తమనెవరు అడ్డుకుంటారో చూస్తామని ఎదురెళ్లి దరఖాస్తులు చేస్తున్నారు. అలాగే సోమవారం సాయంత్రం నియోజకవర్గం కీలక నేత కొంత మంది వ్యాపారులతో భేటీ అయ్యారు. **‘మీకు షాపు వస్తే.. నాకు వాటా ఇవ్వాల్సిందే.. అవసరమైనప్పుడు డబ్బులు సమకూర్చాలి.. ఇలా చేయడం మీకు ఇష్టమైతేనే ముందుకు వెళ్ళండి’** అని తెగేసి చెప్పినట్టు సమాచారం.

స్టేషన్	శ్రీకాకుళం	ఆమదాలవలస	రణస్థలం	పొందూరు	నరసన్నపేట	కొత్తూరు	పాతపట్నం	టెక్కలి	కోటబొమ్మాళి	పలాస	సోంపేట	ఇచ్ఛాపురం
దుకాణాలు	32	13	15	10	12	7	8	11	15	15	12	8
వచ్చిన దరఖాస్తులు	266	71	176	58	35	41	31	19	31	55	50	47



పండగలకు ప్రత్యేక రైళ్లు



విజయనగరం టౌన్: దసరా, పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం నేపథ్యంలో విశాఖపట్నం-శ్రీకాకుళం మధ్య ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు ఈస్ట్‌కోస్ట్ రైల్వే సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖ-శ్రీకాకుళం రోడ్డు స్పెషల్ ఎక్స్‌ప్రెస్ (రైలు నంబర్ 08529) ఈ నెల 10 నుంచి 16 వరకు ఏడు ట్రిప్పులు నడుస్తుందన్నారు. విశాఖలో ఉదయం 10 గంటలకు బయలుదేరే రైలు శ్రీకాకుళానికి మధ్యాహ్నం 12.30కి చేరుతుందన్నారు. శ్రీకాకుళం రోడ్డు-విశాఖ(రైలు నంబర్ 08530)స్పెషల్ ఎక్స్‌ప్రెస్ శ్రీకాకుళంలో మధ్యాహ్నం 1.30 గంటలకు బయలుదేరి విశాఖకు 3-55 గంటలకు చేరుతుందన్నారు. సింహాచలం, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి, పొందూరు స్టేషన్లలో రైలు ఆగుతుందన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం: సమగ్ర శిక్ష సొసైటీ (పాఠశాల విద్యాశాఖ) ద్వారా నిర్వహిస్తున్న కేజీబీవీ (కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం), ఏపీ మోడల్ స్కూళ్లలో ఖాళీగా ఉన్న బోధనేతర సిబ్బంది పోస్టులను ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన (2024-25 విద్యా సంవత్సరంలో ఏడాది కాలానికి) భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం నుంచి సోమవారం ప్రకటన విడుదలైంది. కేజీబీవీలో అసిస్టెంట్ కుక్ 9, డే అండ్ నైట్ వాచ్ ఉమెన్ 4, స్కావెంజర్లు 3, స్వీపర్ 4, మోడల్ స్కూల్ చౌకీదారు 6, హెడ్‌కుక్ 4, అసిస్టెంట్ కుక్ 6 పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వివరించారు. ఆసక్తి గల మహిళా అభ్యర్థులు ఆఫ్‌లైన్‌లో ఈ నెల 15లోగా మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించవచ్చని పేర్కొన్నారు.

ఆడుదామా దాండియా..





- నగరంలో ఉత్సాహంగా దాండియా నృత్యాలు
- నవరాత్రి వేడుకల్లో రాజస్థానీల ప్రదర్శన
- పదేళ్లుగా నిర్వహణ

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్రంలో దాండియా నృత్యాల సందడి నెలకొంది. దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా రాజస్థానీల కుటుంబ సమేతంగా రాత్రిపూట సంప్రదాయ దాండియా నృత్యాలతో సందడి చేస్తున్నారు. నగరంలో సుమారు 5వేల మంది రాజస్థానీ కుటుంబాలు పదేళ్లుగా దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. స్థానిక టౌనుహాలు వేదికగా అమ్మవారి చిత్రపటాన్ని ఏర్పాటు చేసుకొని పూజలతో పాటు దాండియా నృత్యాన్ని ప్రతిరోజూ ప్రదర్శిస్తున్నారు. తొమ్మిది రోజుల పాటు నృత్య ప్రదర్శనలు జరుగుతాయి.

ప్రదర్శన.. ప్రత్యేకం..
దాండియా అనేది మన రాష్ట్రంలో కోలాట ప్రదర్శనను పోలి ఉంటుంది. గుజరాత్ రాష్ట్రంలోని జానపద నృత్యమైన దాండియా నవరాత్రి పండగలో ప్రసిద్ధి చెందింది. రాజస్థాన్‌లోని మార్వార్‌లో పెద్ద ఎత్తున దాండియా నృత్య పోటీలు జరుగుతుంటాయి. స్త్రీ, పురుషులు సంప్రదాయంగా రెండు వరుసల్లో సవ్యదిశలో కదులుతూ కర్రలను కొడుతూ సందడి చేస్తారు. ఈ సమయంలో ప్రత్యేక దుస్తులు ధరిస్తారు.

ప్రతి దసరాకు దాండియా



ప్రతి ఏడాది దసరా ఉత్సవాల సందర్భంగా సంప్రదాయంగా పూజలు చేస్తాం. అందరం కలిసి దాండియా ఆడుతాం. ఇందులో అన్ని కుటుంబాలు పాల్గొంటాయి. – రాజేంద్ర కర్నాని, వ్యాపారవేత్త, శ్రీకాకుళం

అందరం కలిసి..



కుటుంబ సభ్యులంతా ఈ ఉత్సవాలలో పాల్గొని దాండియా ఆడతాం. ఇదో ప్రత్యేక సంప్రదాయం. ప్రతి ఒక్కరూ పాల్గొంటాం.
– భగత్ సింగ్, వ్యాపారి, శ్రీకాకుళం

కలెక్టర్ గ్రీవెన్స్‌కు వినతులు 129



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్, జేసీ, అధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక నిర్వహించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, జిల్లా రెవెన్యూ అధికారి అప్పారావు, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్ హాజరై 129 వినతులు స్వీకరించారు. ఎచ్చెర్ల మండలం ఫరీద్‌పేట సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేయడంలో పంచాయతీరాజ్ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై న్యాయస్థానం తీర్పును అమలు చేయలేదని గ్రామానికి చెందిన కె.అమ్మినాయుడు ఫిర్యాదు చేయగా, ఫైల్‌ను డీపీఓ కార్యాలయం తొక్కిపెట్టారని ఆరోపించారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు వినతులు 51



వృద్ధుడి గోడువింటున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసం ప్రజా ఫిర్యాదుల వేదికలో అర్జీదారుల నుంచి 51 వినతులు అందాయి. ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి వినతులు స్వీకరించి ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

క్లుప్తంగా

బ్రహ్మోత్సవాల్లో హారికా సునీత్ బృందం



రాధాకృష్ణ గోపికల వేషధారణలో బృందం

నరసన్నపేట: తిరుమలలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి వారు కల్పవృక్ష వాహనంపై ఊరేగగా.. నరసన్నపేటకు చెందిన హారికా సునీత్ బృందం నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకుంది. మారుతీనగర్‌కు చెందిన 25 మంది సభ్యులు కోలాట ప్రదర్శన చేశారు.

జిల్లా పంచాయతీ అధికారిగా భారతీ సౌజన్య



భారతీ సౌజన్య

అరసవల్లి: జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ)గా కె.భారతీ సౌజన్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఏఓ కోటేశ్వరరావు తదితర విభాగాల సహాయకులతో చర్చించారు. అనంతరం జెడ్పీలో జరిగిన గ్రీవెన్స్‌లో పాల్గొని కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

కుంటిభద్ర ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

కొత్తూరు: మండలంలోని కుంటిభద్ర ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ ఏ.జగదీశ్వరరావును విధుల నుంచి సస్పెండ్ చేస్తూ డ్వామా పీడీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సోమవారం మండల పరిషత్ కార్యాలయానికి ఉత్తర్వులు చేరాయి.

సీఐలకు స్థానచలనం

శ్రీకాకుళం క్రైమ్ : విశాఖ రేంజి పరిధిలో ఇద్దరు సీఐలను జిల్లాకు బదిలీ చేస్తున్నట్లు డీఐజీ కార్యాలయం నుంచి సోమవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. వీరిలో ఎం.తిరుపతిరావు (కాశీబుగ్గ రూరల్ సర్కిల్), టి.త్రినేత్రి (శ్రీకాకుళం మహిళా పోలీస్ స్టేషన్)లు ఉన్నారు. కాగా కాశీబుగ్గ రూరల్ సర్కిల్‌లో పనిచేసిన పి.ఈశ్వరరావు విశాఖ వీఆర్‌కు వెళ్లనున్నారు.

అండర్-14 బాలుర క్రికెట్ జట్టు ఖరారు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా అండర్-14 బాలుర క్రికెట్ జట్టు ఖరారైంది. 2024-25 సీజన్‌కుగాను ఇటీవల జరిగిన ఎంపికల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు సెలక్షన్ మ్యాచ్‌లు నిర్వహించిన తర్వాత 16 మందితో కూడిన తుది జాబితాను జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శులు పుల్లెల శాస్త్రి, హసన్‌రాజా, మెంటార్ ఇలియాస్ మహ్మద్ సోమవారం వెల్లడించారు. ఈ నెల 10 నుంచి 23 వరకు గుంటూరు వేదికగా జరగనున్న ఏసీఏ అంతర్ జిల్లాల అండర్-14 క్రికెట్ టోర్నమెంట్‌లో జిల్లా జట్టు పాల్గొంటుందని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులంతా ఈ నెల 8న విశాఖ రైల్వేస్టేషన్ వద్ద రిపోర్ట్ చేయాలన్నారు. జట్టుకు కోచ్ మేనేజర్లగా శ్రీనివాస్, కిరణ్‌లు వ్యవహరిస్తారని తెలిపారు.

జిల్లా అండర్-14 జట్టు ఇదే..

ఎస్.వివేకానంద (కెప్టెన్), ఎ.నేత్రకిరణ్, వి.కృష్ణకౌషన్, ఎన్.జోగేంద్ర, ఎం.పవన్‌కుమార్, ఎస్.వెంకట్‌ప్రేరణ్, జె.హర్షవర్ధన్, శ్రీయోజిత్, ఎస్.రుత్విక్, జీఎస్‌వీ సూర్య, కోండ్రు జోషిత్, షరీఫ్ హక్, సాయి ఆదిత్య, కె.గౌతమ్, టి.జోష్మత్, పి.మోక్షిత్‌శ్రీనిత్య. స్టాండ్‌బైగా ఆర్.షయిల్‌కుమార్, పి.మెహర్‌తేజ, ఎంఎస్ జాన్ వెస్లీ, మనోజ్‌శ్రీసాయి ఉన్నారు.

మెట్‌కోర్ లావాదేవీలపై బహిరంగ విచారణ చేయాలి

టెక్కలి : మండలంలోని రావివలస మెట్‌కోర్ ఫెర్రో ఎల్లాయ్స్ పరిశ్రమకు సంబంధించి యాజమాన్యాల మార్పుపై బహిరంగ విచారణ చేసి కార్మికులను ఆదుకోవాలని కార్మిక సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐటీయూ నాయకుడు ఎన్.షణ్ముఖరావుతో కలిసి సోమవారం కార్మిక శాఖాధికారి ఆర్.రాధాకుమారిని కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తరచూ యాజమాన్యాలు మారుతూ కార్మికులకు పూర్తి స్థాయిలో వేతనాలు, ఇతర అలవెన్సులు అందజేయడం లేదన్నారు. తక్షణమే కలెక్టర్ అధ్యక్షతన బహిరంగ విచారణ చేసి తమను ఆదుకోవాలని కార్మికులు పీఎండీ బోసు, కె.భుజంగరావు, పి.సీతారాం తదితరులు కోరారు.

పసిపిల్లలకు అత్యుత్తమ వైద్యసేవలు



యూనిట్‌ను ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ దాసరి షకీలా

శ్రీకాకుళం: మాతా నియోనాటల్ కేర్(ఎం.ఎన్.సీ.యూ) ద్వారా గర్భిణులకు, పసిపిల్లలకు అత్యుత్తమ వైద్య సేవలు అందించడమే లక్ష్యమని శ్రీకాకుళంలోని జనరల్ గవర్నమెంట్ హాస్పిటల్(జీజీహెచ్)సూపరింటెండెంట్ డాక్టర్ దాసరి షకీలా అన్నారు. ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఎంఎన్‌సీయూను సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇదేం తీరు..!



జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం

- ఫిర్యాదు క్లియరెన్స్‌పై సంతకం చేయాలంటూ ఒత్తిళ్లు
- బాధితురాలి ఇంటికి వెళ్లిన వైద్య శాఖ సిబ్బంది
- తమకు న్యాయమే కావాలంటూ బాధితురాలి పట్టు
- విచారణ పూర్తయినా చర్యలు తీసుకోవడంలో అధికారుల నిర్లక్ష్యం

అరసవల్లి: వైద్య శాఖ ఉద్యోగి నిర్వాకంతో ఓ మహిళకు అన్యాయం జరిగింది.. న్యాయం చేయాలంటూ బాధితురాలి కుటుంబసభ్యులంతా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు, వినతులు అందించగా గత నెల 23న జరిగిన శాఖాపరమైన విచారణ ఫలితం నేటికీ కానరాలేదు.. గత నెల 30న కలెక్టర్ వారి ఫిర్యాదుల వేదికకు వెళ్లి గోడు వెల్లబోసుకుంటే.. కచ్చితంగా న్యాయం చేస్తామంటూ..అటు కలెక్టర్ ఇటు డీఎంహెచ్‌వో మీనాక్షిలు చెప్పి వారం కావస్తున్నా నేటికీ తగిన ఫలితం రాలేదు. దీనికి తోడు వైద్య శాఖ నుంచి బాధితురాలిపై తీవ్రమైన ఒత్తిళ్లు పెరిగిపోయాయి. శాఖకు అనుకూలంగా వ్యవహరించాలంటూ.. ఏకంగా జిల్లా వైద్యశాఖ సిబ్బంది బాధితురాలి ఇంటికి వెళ్లి మరీ ఒత్తిడి తెచ్చారు. ఫిర్యాదు క్లియరెన్స్ ఎండార్స్‌మెంట్‌పై సంతకం చేయాలంటూ ఒత్తిడి తెచ్చారు. వైద్య ఉద్యోగుల వైఖరిపై 'ఇదేం తీరు..' అంటూ బాధితుల కుటుంబసభ్యులతో పాటు స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. విచారణ పూర్తయినా ఇప్పటికీ ఎలాంటి చర్యలు చేపట్టకుండా వైద్యశాఖ ముఖ్య అధికారులు కాలయాపన చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. బాధితురాలి విచారణ వాంగ్మూలాలన్నీ కూడా డీఎంహెచ్‌వో కార్యాలయ అధికారులు మార్చేశారనే అంశంపై త్వరలోనే విచారణ చేపడతారనే చర్చ జరుగుతోంది.

పెండింగ్‌లో ఫిర్యాదు ఉండకుండా..!

గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తే సంబంధిత శాఖాధికారి ఆయా ఫిర్యాదుపై విచారణ చేసి సమస్యను క్లియర్ చేయాల్సి ఉంటుంది. అలా చేస్తేనే డ్యాష్‌బోర్డులో ఫిర్యాదు క్లియర్ అవుతుంది. ఈ క్రమంలో తమ శాఖకు చెందిన ఫిర్యాదును పరిశీలించామని, మోసం చేసిన వ్యక్తి జి.వి.నరసింహమూర్తిపై శాఖాపరంగా చర్యలు తీసుకుంటామంటూ ఎండార్స్‌మెంట్ తయారు చేసి బాధితురాలితో సంతకం చేయించాలనే ప్రణాళికను వైద్య శాఖాధికారులు సిద్ధం చేశారు. అయితే బాధితురాలు ఈ విషయాన్ని గమనించి తనకు న్యాయం జరగడం లేదని తెలుసుకుని తాను సంతకం చేసేది లేదంటూ తెగేసి చెప్పేసింది. ఇంటికి వచ్చి ఒత్తిడి తెచ్చినా సంతకం చేయకపోతే ఎలా అంటూ వైద్యశాఖ సిబ్బంది కాసేపు హడావుడి చేసినట్లు తెలుస్తోంది. ఇదిలావుంటే తాము ఫిర్యాదులో ఇద్దరి పేర్లు ప్రస్తావిస్తే..కేవలం ఒకరిపైనే చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్ఓ మీనాక్షి ఎండార్స్‌మెంట్ సిద్ధం చేయడంపై బాధితురాలు అనుమానం వ్యక్తం చేశారు. రూ.2లక్షలు జి.వి.నరసింహంకు, మరో రూ.లక్ష కార్యాలయ కీలక అధికారికి ఇచ్చామని.. నకిలీ జాబ్ ఆర్డర్ ఇవ్వడంలో వీరిద్దరి పాత్ర ఉందంటూ ఫిర్యాదులో పేర్కొన్నామని, విచారణ అధికారి ముందు వాంగ్మూలాన్ని కూడా ఇచ్చామని బాధితురాలు స్పష్టం చేసింది. తీరా చర్యలు చూస్తే అందుకు భిన్నంగా ఉండటంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని బాధితురాలు కోరుతున్నారు.

పండగ కోసం ఇంటికి వస్తూ..

- రైలు నుంచి జారిపడి ఎస్ఎస్‌బీ జవాన్ మృతి
- నందిగాంలో విషాదఛాయలు



జగదీశ్వరరావు (ఫైల్)



విషాదంలో కుటుంబసభ్యులు

నందిగాం: దసరా పండగను భార్యాపిల్లలు, స్నేహితులతో కలిసి స్వగ్రామంలో జరుపుకుందామని సంతోషంగా బయలుదేరిన జవాన్‌ను మృత్యువు వెంటాడింది. కుటుంబ సభ్యులకు తీరని శోకం మిగిల్చింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నందిగాంకు చెందిన గంటా జగదీశ్వరరావు(36) సశస్త్ర సీమా బల్(ఎస్ఎస్‌బీ)లో జనరల్ డ్యూటీ హెడ్ కానిస్టేబుల్‌గా బీహార్‌లోని జాయినగర్‌లో 48వ బెటాలియన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. భార్య శోభారాణి పిల్లలు జయవర్ధన్(12), చాందినీ(9)లను చదివిస్తూ శ్రీకాకుళంలో ఉంటున్నారు. దసరా పండగ కోసం జగదీశ్వరరావు 15 రోజులు సెలవు పెట్టి స్వగ్రామానికి బయలుదేరాడు. బీహార్ నుంచి హౌరా వచ్చి అక్కడి నుంచి ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌లో పలాసకు ఆదివారం ఉదయం బయలుదేరాడు. దౌల్తీ రైల్వేస్టేషన్ సమీపంలోకి వచ్చేసరికి వాంతులు రావడంతో రైలు డోర్ వద్ద ఉన్న వాష్‌బేసిన్ వద్దకు వచ్చాడు. ఇంతలో అదుపు తప్పి బయటకు తుళ్లిపడటంతో తలకు తీవ్ర గాయాలై మృతి చెందాడు. తనతో పాటు ప్రయాణిస్తున్న 65వ బెటాలియన్‌కు చెందిన ప్రదీప్‌కుమార్ ఈ విషయాన్ని ఎస్ఎస్‌బీ బీహార్ యూనిట్ కంట్రోల్ రూమ్‌కు తెలియజేశాడు. దాంతో అక్కడి అధికారులు ప్రమాదం జరిగిన ప్రాంతానికి సమీపంలో ఉన్న ఎస్ఎస్‌బీ యూనిట్ 63వ బెటాలియన్‌కు సమాచారం అందించగా వారు ఉల్లుబెరియా రైల్వేపోలీస్‌స్టేషన్‌ను సంప్రదించి ఎస్ఐ సమీర్ ముఖర్జీ సహాయంతో జగదీశ్వరరావు మృతదేహానికి పోస్టుమార్టం చేయించారు. మృతదేహాన్ని కోల్‌కతా ఎయిర్‌పోర్టుకు, అక్కడి నుంచి విశాఖకు, తర్వాత రోడ్డు మార్గంలో నందిగాంకు చేర్చాల్సి ఉంది. సోమవారం మృతదేహం వస్తుందని చెప్పిన అధికారులు.. కోల్‌కతాలో దుర్గాపూజ నేపథ్యంలో ట్రాఫిక్ జామ్ కావడంతో సమయానికి చేరుకోకపోవడంతో విమానం తప్పిపోయారు. దీంతో మంగళవారం మధ్యాహ్నానికి మృతదేహం చేర్చిస్తామని కుటుంబసభ్యులకు సమాచారం అందించారు.

పేదలపై కక్ష సాధింపు తగదు



డీటీకి వినతిపత్రం అందిస్తున్న కరకవలస గ్రామస్తులు

జలుమూరు: మండలంలోని శివారు పంచాయతి కరకవలసలో స్థానిక నాయకులు అధికారం అడ్డంపెట్టుకొని పేదలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని గ్రామానికి చెందిన సీపాన జీవరత్నం తదితరులు సోమవారం డిప్యూటీ తహశీల్దార్ జాఫర్ షరీఫ్‌కు వినతిపత్రం అందించారు. గత ఎన్నికలలో వైఎస్సార్ సీపీకి మద్దతుగా ఉన్నారని గ్రామానికి చెందిన పామల బుడ్డోడుపై వివక్ష చూపి పురిపాకను తొలగించేందుకు రెవెన్యూ అధికారులను నోటీసులు జారీ చేయించారని పేర్కొన్నారు. టీడీపీ నాయకులు గురువిల్లి చిన్నవాడు, ఆదినారాయణ, మహేశ్వరం సూర్యంతోపాటు పలువురు కొత్త చెరువు గర్భంలో ఇంటి నిర్మాణాలు చేపట్టినా వారిని విడిచిపెట్టి తమను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

మహిళా కబడ్డీ పోటీల విజేత విశాఖ



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు, అతిథులు

ఎచ్చెర్ల క్యాంపస్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 రాష్ట్రస్థాయి మహిళల కబడ్డీ పోటీల్లో విశాఖపట్నం జట్టు విజేతగా నిలిచింది. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం కేశవరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానం వేదికగా ఆది, సోమవారాల్లో జరిగిన ఈ పోటీలకు ఉమ్మడి 13 జిల్లాల నుంచి 13 జట్లు 156 మంది క్రీడాకారిణులు హాజరయ్యా రు. హోరాహోరీగా సాగిన ఈ పోటీల్లో విశాఖ ప్రథమ, అనంతపురం జట్టు ద్వితీయ స్థానాలు సాధించాయి. శ్రీకాకుళం జిల్లా జట్టు మూడోస్థానానికి పరిమితమైంది. ఉత్తమ ప్రదర్శన ఆధారంగా 16 మంది క్రీడాకారురులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో కె.శ్రీధర్, ఎంపీటీసీ సూర జగదీశ్వరరావు, సర్పంచ్ పైడి భాస్కరరావు, మాజీ సర్పంచ్ పొందూరు భీమారావు, జిల్లా పీడీల సంఘం అధ్యక్షుడు మొజ్జాడ వెంకటరమణ, డాక్టర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఎం.శ్రీనివాసరావు, నిర్వాహకులు ఎం.సుందరరావు, బీవీ రమణ, మొట్ట తిరుపతిరావు పాల్గొన్నారు.

ఎందుకో.. ఏమో..!



- వార్డెన్, సీఆర్టీ పోస్టుల నోటిఫికేషన్‌లో లోపాలు
- సంఖ్య తక్కువగా ఉండటంపై అనుమానాలు

శ్రీకాకుళం: జిల్లాకు సంబంధించి కేజీబీవీ, మోడల్ స్కూల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర పోస్టుల భర్తీకి విడుదల చేసిన నోటిఫికేషన్ లోపాలమయంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చాలా పోస్టులకు ఈ నోటిఫికేషన్‌లో చోటు దక్కలేదు. రాష్ట్ర అధికారులు ఈ ఏడాది జూలై నాటికి జిల్లా నుంచి వెళ్లిన సమాచారం మేరకు నోటిఫికేషన్ విడుదల చేశారు. అయితే వీటిలో సవరణలు చేసుకునేందుకు జిల్లా అధికారులకు అవకాశం కల్పించారు. ఏవైనా పోస్టులు నోటిఫికేషన్‌లో లేకుండా ఉండి ఆ పోస్టులు ఖాళీగా ఉంటే జిల్లా అధికారుల అనుమతితో నోటిఫికేషన్‌లో పొందుపర్చేందుకు వీలుంటుంది. శ్రీకాకుళం జిల్లా విద్యాశాఖ అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవటంతో మూడు, నాలుగు పోస్టులు ఖాళీగా ఉండిపోయే అవకాశం ఉంది. గార కేజీబీవీలో ఫిజికల్ సైన్స్ బోధించే సీఆర్టీ జూలైలో రాజీనామా చేశారు. ఈ పోస్టును ప్రస్తుత నోటిఫికేషన్‌లో పొందుపర్చలేదు. స్థానికంగా గెస్టు ఫ్యాకల్టీ ఏర్పాటు చేసుకుని బోధన సాగిస్తున్నారు. ఇలాంటి ఘటనలు అనేకం ఉన్నాయని దరఖాస్తు చేసుకున్న పలువురు అభ్యర్థులు చెబుతున్నారు. నోటిఫికేషన్‌లో లేకపోవటంతో వాటికోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగుల ఆశలు అడియాసలవుతున్నాయి. మరో నోటిఫికేషన్ వచ్చేంత వరకు గెస్టు ఫ్యాకల్టీతోనే కొనసాగించే పరిస్థితి నెలకొంది. మరోవైపు ఉద్యోగాల భర్తీ విధానం పట్ల అభ్యర్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే గెస్టు ఫ్యాకల్టీగా పనిచేస్తున్న వారికి వెయిటేజ్ మార్కులు ఉండటం, అభ్యర్థులు వారి విద్యార్హతల్లో కూడా వెయిటేజ్ మార్కులు ఉండటం, కొందరు వీటిని తప్పుగా నమోదు చేసి ఎక్కువ వెయిటేజ్ వచ్చేలా చేస్తారన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కొందరు ఎస్ఓలు తప్పుడు ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ విషయమై జిల్లా అధికారులు దృష్టి సారించాలని అభ్యర్థులు కోరుతున్నారు.

ఆధారాలిస్తే చర్యలు..

తప్పుడు సర్వీస్ పత్రాలు జారీ చేస్తున్నట్లు ఆధారాలతో ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకుంటాం. వెయిటేజ్ మార్కులు నమోదులో ఎలాంటి అపోహలకు తావులేకుండా పారదర్శకత పాటిస్తాం. అభ్యర్థులకు ఎలాంటి అనుమానాలు వద్దు. నోటిఫికేషన్‌లో చోటు దక్కని పోస్టులపై ఉన్నతాధికారులతో చర్చిస్తాం.

– తిరుమల చైతన్య, డీఈఓ, శ్రీకాకుళం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం పట్టణం నుంచి పొన్నాడకు బైక్‌పై వెళుతున్న పి.శ్యామలరావును నాగావళి నది వంతెన సమీపంలో సోమవారం ఎదురుగా వస్తున్న ఆటో ఢీ కొట్టింది. ఈ ఘటనలో గాయపడిన శ్యామలరావును 108 అంబులెన్సులో శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు. ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీకాకుళం ప్రభుత్వ ఆస్పత్రి డీడీగా శ్రీనివాస్‌కుమార్

మహారాణిపేట (విశాఖ) : కేజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్ (పరిపాలన) సీహెచ్.శ్రీనివాస్‌కుమార్‌కు పదోన్నతి లభించింది. శ్రీకాకుళం జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో డిప్యూటీ డైరెక్టర్ (పరిపాలన)గా నియమించారు. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టీ. కృష్ణబాబు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

భార్యాపిల్లలు కనిపించడం లేదని ఫిర్యాదు

ఎచ్చెర్ల క్యాంపస్: ఈ నెల 5 నుంచి తన భార్యాపిల్లలు కనిపించడం లేదని పొన్నాడ గ్రామానికి చెందిన కరగాన అప్పలరాజు సోమవారం ఎచ్చెర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. కుమారులు ఢిల్లీశ్వరరావు, హేమంత్‌తో కలిసి భార్య మల్లీశ్వరి కన్నవారి ఇంటికి వెళ్లి ఉంటుందని భావించామని, అక్కడ ఆరా తీస్తే రాలేదని తెలిసిందని పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

పోర్టు భూముల రీసర్వే పరిశీలన

టెక్కలి: సంతబొమ్మాళి మండలం మూలపేటలో పోర్టు భూముల రీసర్వేను టెక్కలి ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తి సోమవారం పరిశీలించారు. గతంలో ఎంత వరకు సర్వే జరిగింది.. ఇప్పుడు చేయాల్సిన రీసర్వే ప్రక్రియ తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

రాష్ట్రస్థాయి పోటీల విజేతగా తేజస్విని



పనస తేజస్విని

ఆమదాలవలస: రాజమండ్రి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి 1000 మీటర్ల పరుగు పోటీల్లో ఆమదాలవలస మండలం నిమ్మతొర్లాడ గ్రామానికి చెందిన పనస తేజస్విని విజేతగా నిలిచింది. నిమ్మతొర్లాడ జెడ్పీ హైస్కూల్లో చదువుతున్న తేజశ్వినిని హెచ్ఎం తులసి భాయి, పీడీ తవిటమ్మ, గ్రామస్తులు సోమవారం అభినందించారు.

ఈవోపీఆర్డీ స్వామిభక్తి!

- ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యుల శిక్షణ వేదికపై టీడీపీ నాయకులు



ఎమ్మెల్యే శంకర్‌తో కలిసి వేదిక పంచుకున్న టీడీపీ నాయకులు

శ్రీకాకుళం రూరల్: సంబంధం లేని వ్యక్తులను సైతం అధికారిక కార్యక్రమాల వేదికలపైకి అధికారులు ఆహ్వానిస్తున్నారు. ఇదే విషయం సోమవారం స్థానిక మండలాభివృద్ధి కార్యాలయంలో ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులకు నిర్వహించిన శిక్షణ శిబిరంలో వెలుగు చూసింది. ఎమ్మెల్యే గొండు శంకర్‌తోపాటు వేదికను పంచుకున్నవారిలో ఒకరు బైరి గ్రామానికి చెందిన నాయకుడు కాగా.. ఇంకొకరు కళ్లేపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి. వీరిని ఏ హోదాలో వేదికపై మండల ఈవోపీఆర్డీ కూర్చోబెట్టారో ఆయనకే తెలియాలి. ఈ దృశ్యాన్ని చూసిన కార్యక్రమానికి హాజరైన మిగతా సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది ఆశ్చర్యపోయారు. స్థానికంగా విధులు నిర్వహిస్తున్న ఈవోపీఆర్డీ సూర్యనారాయణ మాత్రం వీరికి వేదికపై ప్రత్యేకంగా కుర్చీలు వేసి ఆయన స్వామిభక్తిని చాటుకున్నారు. ఏ ప్రాతిపదికన వీరిని వేదికపై కూర్చోబెట్టారని ఈవోపీఆర్డీ వద్ద ప్రస్తావించగా పొంతనలేని సమాధానం చెప్పారు. ఒకసారి వేదిక ఖాళీగా ఉందని, ఇంకోసారి ఎమ్మెల్యే పిలవమన్నారంటూ సమాధానం చెప్పడం గమనార్హం. వేదికపై ఉన్న ఎంపీడీవో కూడా దీన్ని పట్టించుకోలేదు.

సకాలంలో నిధులు మంజూరు: ఎమ్మెల్యే

శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో నిధులు మంజూరు చేసినట్టు చెప్పారు. పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు వచ్చే సమస్యలను పరిష్కరించే విధంగా విధులు నిర్వహించాలని సూచించారు.

18 నుంచి నాటిక పోటీలు



నాటిక పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బాపూజీ కళామందిర్‌లో సుమిత్రా కళాసమితి, సూత్రా ఫౌండేషన్ సంయుక్త నిర్వహణలో ఈ నెల 18 నుంచి మూడు రోజుల పాటు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా నాటిక పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు సోమవారం అరసవల్లిలోని ఓ ప్రైవేటు గృహంలో నాటిక పోటీల బ్రోచర్ ఆవిష్కరించారు. 18న అంతర్ముఖం(మందస), పులికాలం(ఆమదాలవలస), 19న కొండగాలి (పెదమేరంగి), మార్పు(కత్తివరం), కెరటాలు(రాజాం), 20న ది డెత్ ఆఫ్ ఎ మ్యాన్ ఈటర్ (బొరివంక), సప్తమ సూత్రం(పాగిరి) నాటిక ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. ముగింపు సభలో కళాకారులు బీఎంఎస్ పట్నాయిక్(దర్శకుడు), కలగ గణేష్‌యాదవ్(టీవీ సినీ నటుడు), గుత్తు చిన్నారావు(నటుడు, న్యాయనిర్ణేత), బొల్ల లలితా రాణి(ప్రముఖ నటి)లను సత్కరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇప్పిలి శంకరశర్మ, నిక్కు హరిసత్యనారాయణ, గుత్తు చిన్నారావు, మండవిల్లి రవి, కిల్లాన ఫల్గుణరావు, పులఖండం శ్రీనివాసరావు, బీఎంఎస్ పట్నాయిక్, వరలక్ష్మీ, పూజ, జ్యోతి, ఉషారాణి, నందికేశ్వరరావు, నక్క శంకరరావు, కొమనాపల్లి సురేష్, మల్లెమొగ్గల రాజు తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో షాపు దగ్ధం



కాలిపోయిన షాపు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని కుందువానిపేట బీచ్‌లో నిర్వహిస్తున్న షాపులో సోమవారం వేకువజామున విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ సంభవించింది. ఈ ఘటనలో షాపులో సామగ్రితో పాటు పక్కనే ఉన్న వలలు కాలిబూడిదయ్యాయి. విషయం తెలుసుకున్న రూరల్ ఎస్ఐ కిషోర్‌వర్మ, ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో సుమారు రూ.4 లక్షలు నష్టం వాటిల్లినట్లు సమాచారం. బాధితురాలు దాసరి తులమ్మ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

బిలాయిలో బైపల్లి యువకుడు మృతి



జోగి రమేష్(ఫైల్)

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని బైపల్లి గ్రామానికి చెందిన యువకుడు జోగి రమేష్ (28) ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బిలాయిలోని చంద్రపూర్‌లో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. రమేష్ ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌లో ఉంటూ శనివారం బిలాయి వెళ్లాడు. శరన్నవరాత్రులు సందర్భంగా ఆదివారం ఉదయం చంద్రపూర్ సమీపంలోని చంద్రహాస్ దర్శనం కోసం వెళ్లి అక్కడి నదిలో స్నానానికి దిగాడు. ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. అధికార యంత్రాంగం గాలింపు చర్యలు చేపట్టగా సోమవారం ఉదయం శవమై తేలాడు. రమేష్ తల్లిదండ్రులు జయలక్ష్మి, ఆదినారాయణ ఉద్యోగ రీత్యా బిలాయిలోనే ఉంటున్నారు. అందివచ్చిన ఏకైక కుమారుడు మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

పేలు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



మృతుడు రామారావు

హిరమండలం: మండలంలోని సుభలయ కాలనీకి చెందిన పి.రామారావు (59) పేలు మందుతాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఎండీ యాసిన్ తెలిపారు. ఐదు రోజుల కిందట రామారావుకు టీబీ వచ్చిందని తెలిసి జీవితంపై విరక్తి చెంది పేలు మందు తాగేశాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వైద్యసేవల నిమిత్తం హిరమండలంలోని ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. రామారావు భార్య పి.పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తుచేసినట్లు ఎస్సై తెలిపారు.

త్వరలోనే మాస్టర్ ప్లాన్ పనులు

అరసవల్లి: అరసవల్లి పుణ్యక్షేత్రాన్ని అద్భుతంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని.. ఈ మేరకు మాస్టర్ ప్లాన్ పనులను త్వరలోనే ప్రారంభించనున్నామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. సోమవారం అరసవల్లి ఆలయానికి విచ్చేసిన ఆయన మాస్టర్ ప్లాన్ డీపీఆర్ తయారి, మాడవీధులు, ఇంద్రపుష్కరిణి అభివృద్ధి తదితర అంశాలపై ఈవో వై.భద్రాజీ, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలతో సమీక్షించారు. జాతీయ రహదారిలో అరసవల్లి ఆలయ మార్గాలను తెలిపేలా బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆలయ ప్రధాన రోడ్లు విస్తరణ చేపట్టనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు ఉంగటి వెంకటరమణమూర్తి, రాయిపల్లి అర్జున్, కొయ్యాన రామ్మోహనరావు పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ



బాల్‌బ్యాడ్మింటన్ క్రీడాకారులతో జిల్లా సంఘ సభ్యులు, కోచ్‌లు

శ్రీకాకుళం న్యూకాలనీ: బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల విజయపరంపర కొనసాగుతోంది. ఈ నెల 5 నుంచి 7వరకు విశాఖపట్నం జిల్లా నునపర్తి వేదికగా జరిగిన 9వ ఏపీ రాష్ట్రస్థాయి జూనియర్స్ బాలబాలికల బాల్‌బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2024 పోటీల్లో శ్రీకాకుళం జిల్లా బాలురు జట్టు ద్వితీయ స్థానంలో, బాలికల జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. రాష్ట్రపోటీల్లో విశేషంగా రాణించిన గుణుపూర్ లక్ష్మణ (ఎస్ఎం పురం గ్రామం, సమత కాలేజ్, వైజాగ్), సిస్టు హేమంత్‌కుమార్ (కుశాలాపురం గ్రామం, చైతన్య సహకార జూనియర్ కాలేజ్ శ్రీకాకుళం), సింగూరు నందిని (ఎచ్చెర్ల పోలీస్ క్వార్టర్స్, డాక్టర్ బి.ఆర్ గురుకులం ఎచ్చెర్ల), ముంత గాయత్రి (ఎచ్చెర్ల గ్రామం, చైతన్య సహకార జూనియర్ కాలేజ్ శ్రీకాకుళం)లు జాతీయ స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారు. సీనియర్ నేషనల్ బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు, ఎస్సై యానాళ్ల తారకేశ్వరరావు(ఎచ్చెర్ల పోలీస్ క్వార్టర్స్) ప్రోత్సాహంతో వీరంతా అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నారు.